# ఉపహారం

భట్టిప్రోలు కృష్ణమూర్తి

**తెల్లవారిన దగ్గరనుండి శుభ్రంగా ఒక్క మబ్బుతునకన్నా ఆకాశంలో లేదు. దసరా వచ్చేస్తూంది, మరి వర్షాలు ఎత్తి కొట్టేస్తాయిఅనుకున్నారు అందరూ. అయితే హఠాత్తుగా ఏదు దాటుగానే పడమటి దిక్కునుండి నల్లగా పైకిలేచిన మబ్బుల గుంపు అంతకంతకూ ఆకాశం అంతా నిండి పోయి ఒక్కసారిగా చీకటి చీకటిగా చేసింది విజయనగరాన్ని.**

రెండోసారి కాఫీ త్రాగిన తర్వాత ఇంక లేచి స్నానం ముగించుకుని ఆఫీసుకు వెళ్దాం అనుకుంటున్న నాగేశం గేటు దగ్గరకు వచ్చి సైకిలు దిగిన క్రొత్త మనిషిని చూసి ఆశ్చర్య పడ్డాడు , ఇంత ప్రొద్దున్నే ఎవడు చెప్మా దిగబడ్డాడు అనుకుంటూ.

ఆ వచ్చిన మనిషి "టెలిగ్రాం సార్" అని అంటూ అది అందించి సంతకం పుచ్చుకుని ఆముదం త్రాగినవానిలా మొహం పెట్టి వెళ్ళి పోయాడు. మామూలుగా టెలిగ్రాములు తెచ్చే మనుషులలా మామూలు (లంచం) కోసం అపే క్షించకుండా అతడు వెళ్ళిపోవడం కొద్దిగా అతనికి ఆశ్చర్యం కలిగింది.

అది విప్పి చదవగానే ఆశ్చర్యం పోయి మొఖం వివర్ణమైంది. "తల్లి మరణించింది వెంటనే రండి" అని వుంది అందులో. అతని అన్న విశ్వనాథం పెద్దాపురం నుండి పంపిన టెలిగ్రాం అది. పెద్దాపురానికి నాలుగు మైళ్ళ దూరమే నాగేశం సొంత ఊరు. అంతకు నెల క్రితమే అతడు కుటుంబసమేతంగా వెళ్లి మంచం మీద వున్న తల్లిని చూసి కొన్నాళ్ళు వుండివచ్చాడు. డాక్టరు కొన్నాళ్ళకు తేరుకుంటుందని అభయమివ్వ డంతో, జ్యోతిష్కుడు ఆవిడ ఆయుర్దాయం ఇంకా ఒక పదేళ్లు పైనే వుంది అనడమూ అతనికి ధైర్యం కలిగిం చాయి. ఇంతలోనే ఈ పిడుగులాంటి వార్త! దేవుడి మీద నమ్మకం బాగా వున్న అతడు: "ఏమిటి తండ్రీ, ఈ నీ లీల?" అనుకుంటూ చేతులు జోడించి ఆకాశం వైపు తిరిగి నమస్కారం పెట్టి భార్యను కేకవేసి పిలిచి చల్లగా ఆ చావు కబురు తెలియజేశాడు.

వాళ్ళ మామగారు అంతకు రెండురోజుల క్రితమే ఆ ఊరు ఏదో పనిమీద వచ్చి ప్రస్తుతం పూజలో వున్నాడు దేవుడి గదిలో.

నాగేశం భార్య పార్వతికి అత్తగారంటే ప్రాణం. ఆరు నెలల క్రిందటివరకు ఆవిడ చిన్న కోడలు దగ్గరే వుండేది. అయితే ఇద్దరు అన్నదమ్ములలో తానే ఎందుకు ఆ భారం ఎప్పుడూ వహించాలన్న ఉద్దేశంతో ఏదో పెళ్లికి వెళ్తున్నాం అని తల్లిని అన్న దగ్గర వదిలిపెట్టాడు. తిరుగు ప్రయాణంలో పార్వతి ఎంత చెప్పినా వినకుండా,"కొన్నాళ్లు అన్నయ్య దగ్గర వుండనీ- ఆవిడకీ కొంత సంతృప్తి" అని తల్లిని మరి తీసుకురాలేదు.

ఇప్పుడు తన దురుద్దేశపు పనికి మనస్సు చివుక్కుమంటు న్నది అతనికి. పార్వతికి మటుకు కన్నతల్లిలాగే తనను చూసుకున్న అత్తగారి మరణవార్త వినగానే దుఃఖం ఆగక చీరచెంగు మొహం మీద కప్పుకుని వెక్కి వెక్కి ఏడవడవం మొదలుపెట్టింది. ఆమెను ఓదారుస్తూ "అంతా భగవద్లీల పారూ! ఎవళ్లా ఏమీ చెయ్యలేము, పెద్ద వయస్సు! అందులో నాన్న







**లేటు వయసులో రసికరాజు ఘాటు ప్రేమ**

'ఎంతటివారైనా కాంతాదాసులే' అన్నారు. అయితే అధికారంలో వున్నవారు తమ కాంతాదాస్యాన్ని

పోయాక మరీ కుంగిపోయిందమ్మ. ఊరుకో- భరించాలి బాధలోలోపలే!' అన్నాడు నాగేశం.

"అందరం వెళ్దాం" అంది పార్వతి. కాని నాగేశం "అందరూ వెళ్లి చేసేదేముంది? వంటి పిల్లా, నువ్వూ, నేనూ వెళదాం. మీ తరపున ఎవరో మీ అమ్మగారో నాన్నగారో ఒకరే వెళ్లాలి- ఇద్దరూ వెళ్లకూడదు. పూజ అయిన తర్వాత మీ నాన్నగారికి చెప్తు. ఆయన తొమ్మి దవ రోజుకు వస్తారో లేక వెళ్లి మీ అమ్మగారినీ, తమ్ముణ్ణీ పంపుతారో!" అన్నాడు.

చివరికు నాగేశం, పార్వతి, రెండేళ్ల నిండని వంటిపిల్ల రమా, వాళ్ల మామగారూ ఆ రోజే మెయిల్‌కు వెళ్లడానికి స్థిరమైంది. మెయిల్ పదకొండు గంటల ప్రాంతానికి ఆ పట్టణానికి వస్తుంది. అప్పటికి ఎనిమిదన్నర దాటింది.

మొదట సన్నజల్లుగా మొదలైన వాన అంతకంతకూ పెద్దదై తొమ్మిది గంటల కల్లా కుండపోతగా కురియడం మొదలు పెట్టింది, ఏనుగు తొండాలు దిగి వస్తున్నట్టుగా.

ఆదరాబాదరాగా సర్దుకుని ఇంత పప్పూ, చారూ, ఊరగాయ, మజ్జిగా అన్నం తిని వాళ్ళు నలుగురూ పదిన్నరకు స్టేషనుకు చేరుకున్నారు. వంటిపిల్ల తప్ప తక్కిన వాళ్లందరూ రిక్షాకు పరదాలు కట్టినా తడిశారు కొంతవరకు. స్టేషన్ వెయింటింగ్ రూంలో చీర మార్చుకుంది పార్వతి.

మెయిల్ పన్నెండు గంటలకు- ఒక గంట లేటుగా- వచ్చింది.

ఆ రోజు అంతగా రద్దీ లేనందువల్ల కిటికీవారగా వాళ్ళు కూర్చోడానికి జాగా దొరికింది. సాయంత్రం ఆరుగంటలలోగా సామర్లకోట చేరుకోవచ్చును- తెల్ల వారు ఝామున పోయిన తల్లి శరీరం మంచుదిమ్మలలో అన్నగాని వుంచితే చివరకు శవాన్ని అయినా చూడవచ్చు అనుకున్నారు వాళ్ళు- ఎలాగైనా అత్తగారిని చివరిసారిగా చూసి కాళ్లు ముట్టుకొని నమస్కారం పెట్టాలి అని వుంది పార్వతికి.

అయితే మెయిల్ ఆ స్టేషన్‌లో పావుగంట మాత్రమే ఆగవలసినా ఒక గంటవరకూ కదలకపోవ డంతో రకరకాల కారణాలు ఎవరు విన్నట్లు వారు వివరించడం మొదలుపెట్టారు. విశాఖపట్టణం విజయ నగరం నడుమ లైను గండిపడిందని కొందరూ, ఏదో గూడ్స్ తాలూకు పెట్టె ఒకటి తిరగబడి లైన్లను అడ్డగించిందని కొందరూ, బ్రిడ్జి ఏదో కూలిపోయిందని కొందరూ అంటున్నారు.

నాగేశం కుటుంబం కూర్చున్న ఎదుటి బెంచీ వారగా కిటికీ ప్రక్క ఓక పాతికేళ్ల లోపు వయస్సు గల అమ్మాయి కూర్చుని వుంది. క్రింద దుప్పటి పరచుకుని ముగ్గురు కూర్చునే స్థలంలో తన బాగ్, పెట్టే ప్రక్కకు పెట్టుకుంది ఆ అమ్మాయి. ఎవరు వచ్చినా మరొక ముగ్గురు వున్నారనీ, అవతలకు వెళ్లారనీ చెపుతూ ఇంకెవర్నీ ఆ స్థలంలో కూర్చోనివ్వలేదు ఆమె.

అప్పటికి ఆకాశం చిల్లులు పడిందో లేక మేఘాలు బద్దలు అయిపోయాయో అన్నట్లు వాన అతి జోరుగా కురుస్తూంది. ఆ అమ్మాయి మాటిమాటికీ లేవడం కూర్చోవడం సామాన్లు అటూ ఇటూ సర్దుకోవడం పెట్టుకున్న కళ్ళజోడు తీసి క్రమ్మిన ఆవిరి తుడుచు కుంటూ మళ్లీ మళ్లీ పెట్టుకోవడం, పైవి మాటిమాటికీ సర్దుకోవడం- ఇలా ఆమె ఏదో ముళ్లమీద వున్నట్టుగా ప్రవర్తించడం చూస్తున్న నాగేశానికి తన పెద్ద కూతురు ఉమ జ్ఞాపకం వచ్చింది. అది ఇలాగే సరిగ్గా ప్రతిదానికీ గాభరాపడుతూ వుంటుంది. ఈ అమ్మాయి కొద్దిగా పెద్దగాని ఆకారంలోనూ, కళ్ళజోడు, కేశాలంకరణ, చీరకట్టూ మొదలైన వాటిలోను ఉమలాగే అనిపించింది అతనికి. ఉమకి పంతొమ్మిదేళ్లు. బి.ఏ. పాసయి ఇంట్లోనే వుంది- పెళ్లి సంబంధాలు చూస్తున్నారు వాళ్లు.

మాటిమాటికీ కిటికీలో నుండి అవతలికి చూడడం విసుగుతో గొణుకుకోవడం చేస్తున్న ఆ అమ్మాయి చూపులు ఎదుటి బెంచీ మీద భార్య ప్రక్కగా కూర్చున్న నాగేశం మీద వ్రాలాయి. అతనికి మధ్య వయస్సు- అంటే నలభై- అప్పుడే దాటినా ఇంకా యువకుడిలాగే కనిపిస్తాడు- ఆరుపురుళ్లు పడ్డపార్వతినిజానికి అతనికన్నా పెద్దేమో అన్న భ్రమ కలుగుతుంది చూసే వాళ్లకు- ఆమె వయస్సు ముప్పై ఆరే అయినా.

తన వైపే కొద్దిగా చిరునవ్వుతో చూస్తున్న నాగేశం చూపులను అపార్థం చేసుకున్న ఆ అమ్మాయి కొద్దిగా చురచుర అతని వైపు చూసి మొహం ముడుచుకుని కిటికీలో నుండి అవతలికి చూపులు పోనిచ్చింది. మెయిల్‌లో వెళ్లవలసిన జనం, దిగబెట్టటానికి వచ్చిన ఆత్మీయులూ, ఇదే అదనుగా బేరసారాలు జోరుగా నెరపుకుంటున్న అమ్మకం మనుషులూ... వీళ్లతో హడావుడిగా వుంది స్టేషన్ ప్లాట్‌ఫారం.

తెలివితేటలలో బాగా చురుకైన నాగేశం ఆ అమ్మాయి అపోహ బోధపరుచుకుని ఆ అమ్మాయికి వినపడేలా నెమ్మదిగా పార్వతితో అన్నాడు. "సరిగ్గా మన అమ్మాయి ఉమ లాగే వుంది కదూ ఆ ఎదుటి బెంచీపిల్ల?"

అత్తగారి గురించి బాధలో పరధ్యానంగా వున్న పార్వతి ఆ అమ్మాయి వైపు పరిశీలనగా చూసి "నిజమే- కొద్దిగా పెద్ద వయస్సు గాని!" అంది నెమ్మదిగా. పార్వతీ, ఆ అమ్మాయి కిటికీ దగ్గరే వుండడం వల్ల ఆ అమ్మాయి స్పష్టంగా భార్యాభర్తల మాటలు విని ఇంచు మించు తన వయస్సే వున్న అమ్మాయే వాళ్లకుందని, తాను అపోహపడ్డాననీ గ్రహించి మనస్సు కలుక్కు మనిపించినట్లయి సరిగా కూర్చుని పార్వతి వైపు తిరిగి అంది "ఏ ఊరు వెళ్లాలండీ?"

"సామర్లకోట- అక్కడనుండి జట్కాలో పెద్దాపురం దగ్గర మా ఊరికి. మా అత్తగారు ఈ తెల్లవారు ఝామునే పోయారు-" పార్వతి కబుర్లపోగు. ఒక ప్రశ్నకు మూడు నాలుగు జవాబులు చెప్పడం అలవాటు ఆమెకు. ప్రతిగా ఆ అమ్మాయిని ప్రశ్న వేసింది "నువ్వే ఊళ్ళో దిగుతావమ్మా?"

"అనకాపల్లండీ! అక్కడ మా అమ్మా నాన్నా వున్నారు. నేను దూసి హైస్కూలులో టీచర్‌గా పనిచేస్తున్నాను. దసరా శలవులకి ఇంటికి వెళ్దాం అని బయలుదేరాను. కాని అప్పుడే ఒంటిగంటన్నర ఇక్కడే అయిపోయింది" ఆ పిల్లా కబుర్ల పోగే. అయితే కొత్త వాళ్ళంటే బెదురు. భార్యాభర్తల మాటలతో ఆ బెదురు తీరిన ఆమె ఇప్పుడు మామూలుగా అయింది.

మృదువుగా, ఆప్యాయంగా నాగేశం అడిగాడు. "నీ పేరేమిటమ్మా?"

"సుగుణండీ. ఈ ఊళ్లోనే బి.ఏ. పాసై విశాఖ పట్టణంలో బి.ఇడి. పాసయ్యాను. మా తమ్ముడు మా మేనమామ గారింట్లో వుండి వైజాగ్‌లో ఇంటర్ చదువు తున్నాడు. వాడి శెలవులింకా నాలుగు రోజులు అయ్యాక మొదలవుతాయి. స్టేషన్‌కు రమ్మని ఉత్తరం రాశాను. అందే వుంటుంది. అక్కడ వాడూ నాలాగే స్టేషన్‌లో పడిగాపులు కాస్తూ వుంటాడు."

ఇంతలో లవుడ్ స్పీకర్‌లో రైల్వే కర్మచారుల ప్రకటన వెలువడింది. "కొత్తవలస దగ్గర ఒక వంతెనకు ఒక వైపున అబెట్‌మెంట్ (రాతి కట్టడం) వరద నీట్లో వదులై ప్రమాదకరంగా వుండటంవలన రిపేర్ చేస్తు



కనిపించనివ్వరు. కానీ గ్రీస్ ప్రధాన మంత్రి తన రసికత్వాన్ని ఏమాత్రం దాచిపెట్టకుండా బహి రంగంగా తన ప్రేయసితో తిరుగుతున్నాడు. గ్రీస్ ప్రధాన మంత్రి ఆండ్రోపాపాండ్రు వయస్సు 68 ఏళ్ళు. పెళ్లి కూడా అయింది. భార్యతో చక్కగానే కాపురం చేసేవాడు. అయితే ఈ మహానుభావుడు ఇటీవలే ఓ చక్కని చుక్క వద్ద తన హృదయాన్ని పారవేసుకున్నాడు. 34 ఏళ్ల ఈ చిన్నదాన్ని విడిచి ఒక్క క్షణం కూడా వుండలేకపోతున్నాడు. దిమిత్రా లియానీ అనే ఈ చిన్నదాన్ని ఎక్కడకు వెళ్లినా తన వెంట తీసుకువెడుతున్నాడు. వీరివురి మధ్య వున్న సంబంధం గ్రీస్ ప్రజలందరికీ తెలుసు. అయితే దాన్ని వాళ్లంతా తప్పుగా భావించడం లేదు.

ఉన్నత హోదాలో వున్నవారికి ఇటువంటి సంబంధాలుండడం వారి పవిత్రతానికి, ఉత్సాహానికి చిహ్నం అంటున్నారు. త్వరలో తన ప్రేయసిని పెళ్లి చేసుకుంటానంటున్నాడు 68 ఏళ్ల ఈ రసిక రాజు.

## ఇంట్లో స్విమ్మింగ్ పూల్



చాలామంది ఇంట్లోనే వ్యాయామం చేయడానికి ఇష్ట పడతారు. బయటకెళ్లి పరిగెత్తడం, నడవడం, జాగింగ్ చేయడం వంటి సదుపాయాలు లేనివారు ఇంట్లోనే వుండి వ్యాయామం చేయడానికి ఇష్టపడతారు. ఆధునిక పరికరాల ద్వారా ఇంట్లోనే వుండి రన్నింగ్, సైకిలింగ్, జాగింగ్ మొదలైనవి చేయవచ్చు. అయితే స్విమ్మింగ్ చేయాలంటే ఇంతవరకు ఇంట్లో ఈ అవకాశం లేదు. అయితే దీనిని దృష్టిలో పెట్టుకుని అమెరికాలోని ఓ కంపెనీవాళ్లు ఇంట్లోనే వుండే ఓ స్విమ్మింగ్ పూల్‌ను తయారుచేశారు. 12 అడుగుల పొడవు, ఆరు అడుగుల వెడల్పు వుండే ఈ స్విమ్మింగ్ పూల్‌కు యూరప్ మార్కెట్‌లో మంచి డిమాండ్ వుంది. 'స్విమెక్స్ సిస్టమ్స్ పేరి'వాళ్లు దీన్ని తయారుచేస్తున్నారు. ఈ స్విమ్మింగ్ పూల్‌లో 2500 గ్యాలన్ల నీటిని నిల్వ చేయవచ్చు. పూల్‌లో అలలు వచ్చేట్లుగా పరికరాలను ఏర్పాటుచేశారు. సరస్సులో ఈత కొట్టినట్టుగానే దీనిలో ఈత కొట్టవచ్చు. నీటి ప్రవాహ వేగాన్ని పెంచడానికి, తగ్గించడానికి ఏర్పాట్లున్నాయి.

—జి.ఆర్.

న్నారు. గంటా రెండు గంటలలో పని పూర్తి కావచ్చు. ఆ వెంటనే మెయిల్ వదుల్తాము. పాసెంజర్లు ఓపికతో ప్రవర్తించవలసిందని ప్రార్థన. మమ్ములను ఆలస్యానికి క్షమించండి. అవాంతర పరిస్థితి ఇది.''

గంటా, రెండు గంటలు అన్నది నాలుగైనా మళ్లీ ఏ రకమైన ప్రకటనా రాలేదు. ప్రయాణీకులలో అలజడి ప్రారంభమైంది. గుంపులు గుంపులుగా స్టేషన్ సూపరింటెండెంట్ గదిముందు మూగి గోల మొదలు పెట్టారు. చివరకు మళ్లీ లవుడ్ స్పీకర్లలో ప్రకటన వెలువడింది-కొన్నిచోట్ల పట్టాల మీదుగా నీరు పారుతున్న దనీ, రైల్వే కర్మచారులు తనిఖీకి వెళ్లారనీ, వాళ్ళ నుండి ఫీల్డ్ టెలిఫోన్‌లో వార్త రాగానే మెయిల్ వదుల్తామనీ, ఎవరైనా ప్రయాణం రద్దు చేసుకోదలిస్తే డబ్బు వాపసు తీసుకోవచ్చునని దాని సారాంశం.

అర్జంట్ పనిలేని కొంతమంది తమ డబ్బు వాపసు తీసుకుని ఇళ్లకు తిరిగి వెళ్లారు. పై ఊళ్ల నుండి వచ్చిన వాళ్ళలో కొంతమంది ఆ పట్టణంలో తమ బంధువులు వుండడం వలన రిఫండ్ తీసుకుని మర్నాడు వాన తగ్గాక వెళ్ళవచ్చని అనుకుంటూ వెళ్ళిపోయారు.

నాగేశం కుటుంబమూ, సుగుణా, మరి కొంత మంది దూర రాష్ట్రాల ప్రయాణీకులు మటుకు మిగిలారు ఆ పెట్టెలో.

చివరకు రాత్రి ఏనిమిదిన్నరకు మెయిల్ ఆ స్టేషన్ వదిలి నెమ్మదిగా వెళ్తూ వాల్తేరు స్టేషన్‌కు పదకొండు గంటలకు చేరుకుంది. అప్పటికి కొద్దిగా వాన వెలిసింది. కాని సన్నగా జల్లుమాత్రం ఒక పది అడుగులు నడిస్తే చాలు మనుషులను తడిపేసేలా పడుతూ వుంది. మరి ఆ మెయిల్ ముందుకు ఆ రాత్రి వెళ్లదనీ, అక్కడితో ఆపేస్తారని, మర్నాటికి కాని ముందుకు వెళ్లడమో, మానడమో నిర్ణయం జరగదని, ప్యాసింజర్లు కావలిస్తే డబ్బు వాపసు తీసుకోవచ్చని ప్రకటించారు.

టికెట్లు గేటుదాటి అవతలికి వెళ్లారు నాగేశం పొత్తిళ్లలో బాగా రమను పొదివి పట్టిన పార్వతీ, వాళ్లనాన్న రామదాసుగారూ. సుగుణ అటూ ఇటు కిటికీలో నుండి చూసి తమ్ముడు ఎక్కడా కనిపించక పోవడంతో ఒక పది నిముషాలలో తానూ పైకి వచ్చి జన సమర్దంలో మొత్తం మీద నాగేశం కుటుంబం ఉన్న చోటు గమనించి అక్కడికి వచ్చి బ్యాగ్, పెట్టె వాళ్ళ సామాన్ల ప్రక్కగా పెట్టి బెదురుగా అటూ ఇటూ చూస్తూ అంది ''మా తమ్ముడు రాలేదండీ- నా ఉత్తరం అసలు అందిం దో లేదో! అందితే ఎంత రాత్రైనా కాచుకుని ఉండేవాడే'' ''పాపం మీ మేనమామ గారి ఇల్లు ఎక్కడమ్మా?'' నాగేశం జాలిగా అడిగాడు. అప్పుడే తమ డబ్బు రిఫండ్ తీసుకొచ్చాడు అతడు.

''సీతమ్మధారలోనండీ''

''చాలా దూరమేనే-ఇక్కడ డాబా గార్డెన్స్‌లో జెయిల్ దగ్గర లలితా కాలనీలో మా కజిన్ ఉన్నాడు. అక్కడికీ ఈ వానలో వెళ్ళమంటున్నారు రిక్షావాళ్ళు. అందరూ ఇక్కడే ఆ మూలకూర్చుని బీడీలు కాలుస్తున్నారు-బాతాఖానీ కొడ్తూ'' అన్నాడు రామదాసు.

''ఇంత రాత్రి ఈ వానలో ఎలా సీతమ్మధారకి వెళ్లడమో బోధపడకుండా వుంది''అంది అటూ ఇటూ బెదురుగా చూస్తూ సుగుణ.

''రిఫండ్ తీసుకున్నావా?''

''వెధవ రిఫండ్-రెండు రూపాయలేగా పోతేపోయింది. ఇక్కడ నుంచి వెళ్ళడం ఎలాగా అని బాధ-మా మామయ్య ఇంటికి.''

పార్వతి అంది జాలిగా.''మాతోపాటు నీకడ్డు లేకపోతే మా బంధువింటికిరా. అక్కడి నుండి ఎవరినన్నా సాయం ఇచ్చి పంపే ఏర్పాటు చేస్తాము సుగుణమ్మా!''

రామదాసు కొద్దిగా చిరాకుగా అన్నాడు ''ఇప్పటికే మనకి రిక్షాలు దొరకలేదు. ఇక్కడి నుంచి జెయిల్ ప్రక్కవీధికి ఇరవై రూపాయలిస్తే వస్తామన్నాడు ఒక రిక్షా వాడు. అందరమూ రాత్రికి ఏదో ఇన్ని పళ్లు తిని ఇక్కడే స్టేషన్‌లో ఉండిపోదాం. ఉదయం మాద్దాం.''

నాగేశం అన్నాడు ''ముందర చాలా చోట్ల గండి పడిందట. రేపుకాదు వారం రోజుల వరకూ లైను బాగయ్యే ఛాన్స్ లేదంటున్నారు చాలామంది. మా కజిన్ ఇంటికెళ్తాం. ఏదన్నా బస్సు దొరికితే ఉదయం వెళ్లవచ్చు మనం. ఆ అమ్మాయి మనతో మా కజిన్ ఇంటికి రావచ్చు. వర్షం మళ్లీ ఎక్కువైతే ఈ రాత్రికి అక్కడే ఉండి ఉదయం వెళ్లవచ్చు. రిక్షా వాళ్ళకిదే ఛాన్స్-పోతే పోయాయి నలభై రూపాయలు రెండు రిక్షాలు మాట్లాడుకుందాం.''

ముందు అనుమానించింది గాని చివరకు తప్పని సరిగా వాళ్ళతో వెళ్లటానికి ఒప్పుకుంది సుగుణ.

నాగేశం వెళ్లి బేరంచేసి 18 రూపాయిల చొప్పున రెండు రిక్షాలు మాట్లాడి తీసుకు వచ్చాడు.

స్టేషన్ ఆవరణ మెయిన్ రోడ్ కన్నా బాగా క్రిందికి ఉండడం వలన రిక్షా చక్రాలు నీళ్లలో సగంవరకు మునిగి వున్నాయి. మెట్లమీద నీరు పారుతోంది. పెద్ద చెరువులా ఉంది అంతా.

ఒక రిక్షాలో పార్వతీ, సుగుణా-రెండవ రిక్షాలో రామదాసూ, నాగేశం కూర్చున్నారు. అతికష్టం మీద ఈడ్చుకుని ఈడ్చుకుని మెయిన్‌రోడ్ ఎక్కారు రిక్షా వాళ్లు.

నాగేశం కజిన్ వీరభద్రం. వాళ్ల తాతలు అన్న దమ్ములు; అంటే నాగేశం వీరభద్రం అన్న దమ్ముల పిల్లల సంతానం అన్నమాట. తాతాసహోదరుల సంబంధం అంటారు.

వీరభద్రం ఇల్లు చేరాయి రిక్షాలు. సమవయస్కులైన నాగేశం-వీరభద్రం కొన్నాళ్లుకలిసి చదువుకున్నారు. ఆత్మీయ స్నేహితులు కూడా.

వాళ్ల రాగానే వరుసకు తనకు పినతల్లి అయిన రుక్మిణమ్మ పోవడం విని నిజంగానే బాధపడ్డాడు వీరభద్రం. అతని భార్య నాగమణి సౌమ్యురాలు. హడావిడిగా గ్యాస్‌స్టవ్ మీద అన్నమూ, పప్పు, బంగాళా దుంపలూ కుక్కర్‌లో పెట్టి రెండవ వైపున వారు పెట్టింది వాళ్ళ భోజనంకోసం.

వీరభద్రం గారి అబ్బాయి ఆ రోజు ఊళ్లో లేడు. వీరభద్రం ఉబ్బసం మనిషి-నాగేశం, రామదాసూ ఆ విశాఖపట్టణం అంత బాగా తెలియనివాళ్ళు. ''రిక్షా వాళ్ళని నమ్మడానికి వీల్లేదు. అడ్రస్ ఇచ్చినా సరిగ్గా తీసుకు వెళ్తారన్న నమ్మకం లేదు. అనవసరం అల్లరి-ఇక్కడే ఈ రాత్రికి ఉండిపోయి ఉదయం వెళ్లవుగాని అమ్మా!''అన్నాడు వీరభద్రం.

దానికి ఒప్పుకోక తప్పలేదు సుగుణ.

అందరితోపాటు సుగుణ కూడా వేడివేడి భోజనం, కమ్మని నెయ్యితో, ఆవకాయతో, పెరుగుతో చేసింది. ఆ అమ్మాయికి వీరభద్రంగారి అమ్మాయి సరస్వతి గదిలో తెల్లని దుప్పటి వేసి పడక ఏర్పాటు చేశారు, ఒక పట్టె మంచం మీద.

ఇంత సహృదయులు దొరికినందుకు ఆపదలో వున్న తనను ఆదుకున్నందుకు వేయి దేవుళ్ళకు మ్రొక్కుకుంది సుగుణ నిద్రలోనికి జారే ముందు.

* * * *

నాగేశం వీరభద్రం కజిన్స్ అంటే ఏమిటో అను

కుంది సుగుణ. కాని మరునాడు ఉదయం కాఫీ, టిఫినూ పూర్తి అయిన తర్వాత ఇద్దరూ తాతాసహోదర సంబంధం కలవాళ్లనీ 'బందిరాజు' అన్న ఇంటిపేరు ఇద్దరిదీ ఒకటే అనీ తెలిసింది ఆమెకు. గుండె ఝుల్లు మంది. వాళ్లది పూర్వాచార పరాయణమైన కుటుంబం. తాను ఈ రాత్రి-ఉదయమూ తిన్నది మైలకూడు. వీరభద్రం కుటుంబానికీ పదిరోజుల మైల వుంది.

సుగుణ మొహం ముడుచుకుంది. కాని పైకి ఏమీ అనలేదు. జరిగిన సంగతి తల్లితండ్రులకు చెప్పడం తప్ప వేరు గత్యంతరం లేదు. అబద్ధాల్లు ఆడడం ఆమెకు చేతకాదు.

వాన పూర్తిగా వెలిసిపోయింది కానీ ప్రతివీధి లోనూ నీరు రోడ్లమీాద పారుతూనే వుంది, రకరకాల కుళ్లు పదార్థాలతో కలిసి.

తొమ్మిది గంటలకు రిక్షా మీద మేనమామ ఇంటికి వెళ్లిపోయింది సుగుణ.

రోడ్డు కూడా చాలా చోట్ల గండ్లు పడడం వలన బస్సులు నడవక వైజాగ్ నుండి ఆగిపోయింది.

మూడుమైళ్లు నడుచుకు వెళ్ళి ఒక గండి పడ్డ స్థలానికి అవతల అటునుంచి వచ్చి ఉన్న బస్సులో ఎక్కి నాలుగుమైళ్లు వెళ్ళి మళ్లీ బస్సు ముందుకు వెళ్ళలేక పోవడంతో దిగిపోయి గుండెలోతు నీటిలో బట్టలు మూట కట్టుకుని అండర్‌వేర్‌తో వెళ్లి అవతల వచ్చి కాచుకొని ఉన్న మరొక బస్సులో ఎక్కాడు నాగేశం. పార్వతీ-వంటపిల్లా, రామదాసు ప్రయాణం మానుకుని ఆ మర్నాడు విజయనగరం వెళ్ళిపోయారు. ఇక చేసే దేమీ లేదు వాళ్ళకి. పార్వతి ఎంతగానో ఏడ్చింది.

రెండవ బస్సు అయిదారుమైళ్ల కన్నా ఎక్కువ వెళ్ల లేదు. మళ్లీ అండర్‌వేర్‌తో నీటిలో నడుచుకు వెళ్లి ఇంకో బస్సు ఎక్కాడు నాగేశం. మొత్తం మీద తొమ్మిది బస్సులు మారి ఆ సాయంత్రం చీకటి పడ్డాక వాళ్ల ఊరు చేరుకున్నాడు అతడు.

కర్మకాండ ముగిసిన తర్వాత బోడిగుండుతో తిరిగి వచ్చాడు నాగేశం. తల్లిని ఆఖరుసారి చూడ లేనందుకు అతని మనస్సు చాలా బాధలో నిండి వుంది.

తలుపుతీసిన తర్వాత ఇంట్లో అడుగు పెట్టగానే బోడిగుండుతో ఉన్న తండ్రిని చూసి వాళ్ళ నాయిగేళ్ల కొడుకు చంద్రవహా "అమ్మా! అమ్మా! కొత్తనాన్న వచ్చాడే" అని అరిచాడు. ఆ గదిలో ఒక్క పార్వతి తప్ప తక్కిన వాళ్లందరూ ఆ మాటలకు విరగబడి నవ్వారు.

* * *

ఒక నెల గడిచింది.

నాగేశం తలమీద పావు అంగుళం కన్నా కొద్దిగా ఎక్కువగా జుట్టు మొలిచింది. అంతవరకు టోపీ పెట్టు కున్నవాడు ఆ టోపీ వాడటం మానేశాడు.

అయితే మరొక టోపీ అతని తలమీదికెక్కింది. ఆ మర్నాడే. నెల క్రితం చేసిన పనికి అతనికి ఉపహారం అది... ... ... ...

పోస్ట్‌మాన్ తెచ్చి ఇచ్చిన కవరు చదువుతుండగా నాగేశం మొహం వివర్ణమైంది ముందు. ఆ తరువాత సన్నగా చిరునవ్వు విగ్రబాకింది.

అది సుగుణ తండ్రి వ్రాసిన ఉత్తరం.

"బ్రహ్మశ్రీ వేదమూర్తులయిన శ్రీ బందిరాజు నాగేశం గారికి-సవినయంగా శ్రీపతుల సింహాచల వరహా నరసింహం నమస్కరించి వ్రాయునది.

మా అమ్మాయి చి.సుగుణను దసరా సెలవులకు ఇక్కడికి వచ్చినరోజు వర్షంలో వాళ్ళ ఇంటికి తీసుకువెళ్లి ఆదరాభిమానాలతో చూసి మరునాడు మా బావ మరిది ఇంటికి కుశలంగా పంపిన తమకు మా కుటుంబం కృతజ్ఞతలు.

అయితే ఒక విషయం వ్రాస్తున్నందుకు వేరే విధంగా భావించరని వ్రాస్తున్నాను. నేను మిడిల్ స్కూల్లో టీచరును. బీదవాడిని. విశాఖ పట్టణంలో మీ బంధువులూ బందిరాజు వారేననీ వారికీ మైల పది రోజులు ఉందనీ తెలియవచ్చింది. అందువల్ల ఆ మైల ఆహారం తిన్నందుకు ప్రాయశ్చిత్తంగా ఇక్కడ మేము నవగ్రహ శాంతీ వెంకటేశ్వర దీపారాధనా, సత్యనారాయణ వ్రతమూ, పుణ్య వచనమూ మొదలైనవి చేయవలసి వచ్చింది. మొత్తం ఖర్చు వెరశి రూ.78-75 పైసలు. (అక్షరాలా డెబ్బయి ఎనిమిది రూపాయల డెబ్బై పైసలు) అయినది. మా పరిస్థితులను అర్థం చేసుకుని ఉన్నతాధి కారులయిన తమరు ఆ డబ్బు సాధ్యమైనంత త్వరలో నాపేరిట పంపుతారని ఆశిస్తున్నాను.

మరొకసారి కృతజ్ఞత తెలుపుతూ, ఉంటాను

విధేయుడు

ఎస్.ఎస్.వి.యన్.స్వామి

మారు మాట్లాడకుండా భార్యకు కూడా చెప్ప కుండా రూ.79-50పైసలు ఎం.వో చేసి జవాబు వ్రాశాడు నాగేశం.

"......మీరు కోరినట్లు రు.78-75 పై.లతో పాటు కవరు ఖర్చు 0-75పై. కూడా కలిపి పంపుతున్నాను. మీరు కృతజ్ఞత చూపవలసిన అవసరం లేదు. మేము చేసినది మానవధర్మం......ఉంటాను..."

* * *

నరసింహం గారి ఉత్తరమూ, పోస్టలు రశీదూ, ఎం.వో అక్నాలెడ్జ్‌మెంటూ తాను ఎల్లప్పుడూ ఉంచు కునే మెమొరబిలియా (జ్ఞాపకాల చిహ్నాలు) ఫైలులో ఉంచాడు నాగేశం. సుమతీ శత కంలో పద్యభాగం ఒకటి కొన్ని అక్షరాల మార్పుతో అతని మనస్సులో తిరుగుడుపడింది. "ఉపకారికి అపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతీ" ●

## సినారె చతురోక్తులు



### పట్టు పరిశ్రమ

ప్రసిద్ధ కవి డా. సి.నారాయణరెడ్డిగారి మాటల్లో చమత్కారం సహజంగానే వెల్లివిరుస్తుంటుంది. ఓ సారి ఆయన మిత్రులతో కలిసి టి.వి. వార్తలు వింటున్నారు. పట్టు పరిశ్రమ దేశంలో బాగా అభివృద్ధి చెందుతోందని ఒక వార్త.

అది విన్న వెంటనే సి.నా.రె. "పట్టు పరిశ్రమ కాదు - కాళ్ల పట్టు పరిశ్రమ" అని చమత్క రించారు.

### పరిశోధకుల్లో రకాలు

ఓ సభలో డా. సి.నారాయణరెడ్డిగారు పరిశోధ కుల్లో రకాలను ఇలా ఉదాహరణ పూర్వకంగా చెప్పారు:

"భావ కవిత్వాన్ని నారాయణరెడ్డిగారు ఈ ఈ శాఖలుగా విభజించారు. దీంతో నేనూ ఏకీభవిస్తు న్నాను - అని రాసేవాడు ఓ రకం పరిశోధకుడు."

"భావ కవిత్వాన్ని ఈ ఈ శాఖలుగా విభజించ వచ్చని నా అభిప్రాయం. ఈ అభిప్రాయాన్నే నారా యణరెడ్డిగారు కూడా వెలిబుచ్చారు అని రాసేవాడు మరో రకం పరిశోధకుడు."

"ఈ రెండో వాడితో మాత్రం మనం జాగ్రత్తగా వుండాలి" అంటారు నారాయణరెడ్డిగారు.

— మాధవి

